TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 38 | పేజీలు : 05| వెల: రూ.3/-    తెలంగాణ    సోమవారం | మే 18, 2026

## 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకం


2లో..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- విపత్తుల సమయంలో వెంటనే స్పందించాలి
- తక్షణం స్పందిస్తేనే ప్రాణ, ఆస్తి నష్టాల నివారణ సాధ్యం
- ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం
- నెక్లెస్ రోడ్‌లో భారీ 'మాక్ డ్రిల్' ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు.. ప్రపంచస్థాయి సాంకేతికతతో తెలంగాణలో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

## బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు..

- మరింత పకడ్బందీగా కేసు విచారణ!
- నేరం రుజువైతే 20 ఏళ్ల జైలు శిక్ష



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు కేసును మరింత పటిష్టం చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో.. విచారణాధికారులు ఈ కేసులో కొత్తగా భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 64(2)(ఓ)ను అదనంగా చేర్చారు. ఈ సెక్షన్ ప్రకారం నేరం రుజువైతే నిందితుడికి కనీసం పదేళ్లకు తగ్గకుండా లేదా జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. ఈ నెల 8న మైనర్ బాలిక తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మొదట పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12 కింద కేసు నమోదు చేశారు. అయితే, బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకునే క్రమంలో పోలీసులు ఆమెపై ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ఈ కేసుకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన డీసీపీ రితిరాజ్ వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తును వేగవంతం చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, గతంలో పోలీసులు సేకరించిన వాంగ్మూలంలో స్పష్టత లేకపోవడాన్ని ఆమె గుర్తించారు. పోక్సో చట్టం నిబంధనల ప్రకారం.. మహిళా అధికారులు బాధితురాలితో స్నేహపూర్వక వాతావరణంలో మాట్లాడి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. (మిగతాది 2 వ పేజీలో..)

## కేరళ సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం!



- ఆయనతో పాటు ప్రమాణం చేసిన 20 మంది మంత్రులు
- మంత్రివర్గంలో 14 మంది కొత్తవారికే ఛాన్స్
- హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య
- దశాబ్దం తర్వాత కేరళలో 'యూడీఎఫ్' ప్రభంజనం

**తిరువనంతపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేరళ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ రాజభవన్ అధికారిక కార్యక్రమంలో గవర్నర్ ఆయనతో సీఎం వోగా ప్రమాణ స్వీకారం చేయించారు. సతీశన్‌తో పాటు మొత్తం 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ అట్టహాసపు వేడుకకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి (తెలంగాణ), సిద్ధరామయ్య (కర్ణాటక), సుఖ్వీందర్ సింగ్ సుఖు (హిమాచల్ ప్రదేశ్), కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరై నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత పినరయి విజయన్ కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావడం గమనార్హం. కొత్తగా కొలువుదీరిన 20 మంది మంత్రివర్గంలో కాంగ్రెస్ అధిష్ఠానం మునుపెన్నడూ లేని విధంగా సామాజిక, ప్రాంతీయ మరియు మిత్రపక్షాల సమీకరణాలకు పెద్దపీట వేసింది. మొత్తం మంత్రులలో 14 మంది తొలిసారిగా మంత్రి పదవులను చేపట్టడం విశేషం. ఈ సమతూకంతో దశాబ్దం కాలం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పీఠాన్ని దక్కించుకుంది.

### కీలక శాఖలు ఎవరికంటే..?

పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. ముఖ్యమంత్రి సతీశన్ అత్యంత కీలకమైన ఆర్థిక, ఓడరేవుల (పోర్ట్స్) శాఖలను తన వద్దే ఉంచుకోనున్నారు. హోం, విజిలెన్స్ శాఖ: సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖ: కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయించినట్లు సమాచారం. కొచ్చి సమీపంలోని నెట్టూర్‌లో సతీశన్ 1964లో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది, సామాజిక కార్యకర్త. కేరళ విద్యార్థి విభాగం ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి, ఆపై యూత్ కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగారు.


## మరింత పటిష్టంగా భారత్ - నార్వే బంధం!

- ఇరు దేశాల మధ్య 'గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్' ఏర్పాటు
- స్వచ్ఛ ఇంధనం, సాంకేతికత, అంతరిక్ష రంగాల్లో కీలక ఒప్పందాలు
- నార్వే పెట్టుబడులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు


2లో..

## నటుడు దర్శన్ ఆత్మహత్యాయత్నం వదంతులు..

- ఖండించిన జైలు అధికారులు



**బెంగళూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడిగా ఉంటూ బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న కన్నడ నటుడు దర్శన్ తూగుదీప జైలులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సోమవారం వదంతులు వ్యాపించాయి. ఈ వార్త కన్నడనాట తీవ్ర సంచలనంగా మారడమే కాకుండా, జైలు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారితీసింది. అయితే, ఈ వార్తలను జైలు ఉన్నతాధికారులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం రాత్రి నుంచే ఈ తరహా పుకార్లు సామాజిక మాధ్యమాల్లో షికారు చేయడంతో, నిజానిజాలు తెలుసుకునేందుకు అభిమానులు, మీడియా ప్రతినిధులు జైలు ల్యాండ్‌లైన్‌కు వరుస పెట్టి ఫోన్లు చేశారని జైలు సిబ్బంది తెలిపారు. (మిగతాది 2 వ పేజీలో..)

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
సోమవారం, మే 18, 2026

## బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు..

◆ మరింత పకడ్బందీగా కేసు విచారణ!

◆ నేరం రుజువైతే 20 ఏళ్ల జైలు శిక్ష

**(మొదటి పేజీ తరువాయి..)** ఇందులో భాగంగా డీసీపీ రితిరాజ్ నేరుగా బాధితురాలి నివాసానికి వెళ్లి ఆమెతో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ క్రమంలో బాధితురాలు చెప్పిన తీవ్రమైన ఆరోపణలకు, మొదట పోలీసులు నమోదు చేసిన సాధారణ సెక్షన్లకు పొంతన లేదని డీసీపీ గ్రహించారు. బాధితురాలు ఇచ్చిన తాజా వాంగ్మూలం ప్రకారం ఆమెపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్లు స్పష్టమవడంతో, డీసీపీ ఆదేశాల మేరకు కేసులో సెక్షన్లను మార్చారు. పోక్సో చట్టంలోని అత్యంత తీవ్రమైన సెక్షన్ 5(1) రెడ్ విత్ 6 (Section 5(1) r/w 6)ను కేసులో జత చేశారు. ఈ కొత్త సెక్షన్ల ప్రకారం నిందితుడిపై నేరం రుజువైతే.. 20 ఏళ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు పడే అవకాశాలు ఉన్నాయి.

## నటుడు దర్శన్ ఆత్మహత్యాయత్నం వదంతులు..

▪ ఖండించిన జైలు అధికారులు

**(మొదటి పేజీ తరువాయి..)** ఈ వ్యవహారంపై జైళ్ల శాఖ డీజీపీ అలోక్ కుమార్ స్పందిస్తూ.. నటుడు దర్శన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. “దర్శన్ జైలులో పూర్తి క్షేమంగా ఉన్నారు. ఇవన్నీ కేవలం పుకార్లు మాత్రమే. కాబట్టి అభిమానులు, ప్రజలు ఈ వదంతులను నమ్మి పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు వద్దకు రావద్దని” ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు, మంగళవారం (మే 19) నాడు తన వివాహ వార్షికోత్సవం (పెళ్లిరోజు) ఉన్నందున, జైలులో తన కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వాల్సిందిగా నటుడు దర్శన్ కోర్టును ఆశ్రయించారు. అయితే దర్శన్ పెట్టుకున్న ఈ విజ్ఞప్తిపై న్యాయస్థానం ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని జైలు వర్గాలు వెల్లడించాయి. నటి పవిత్రా గౌడ్‌కు సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర సందేశాలు పంపాడనే ఆగ్రహంతో, చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి అనే యువకుడిని కిడ్నాప్ చేసి అత్యంత దారుణంగా హత్య చేశారనే ఆరోపణలను నటుడు దర్శన్ ఎదుర్కొంటున్నారు. ఈ సంచలన హత్య కేసులో ఏ-1 నిందితురాలిగా పవిత్రా గౌడ్, ఏ-2 నిందితుడిగా దర్శన్ ఉన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు దర్శన్‌తో పాటు మొత్తం 15 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే.

# ‘గోల్డెన్ అవర్’ అత్యంత కీలకం

▪ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
▪ విపత్తుల సమయంలో వెంటనే స్పందించాలి
▪ తక్షణం స్పందిస్తేనే ప్రాణ, ఆస్తి నష్టాల నివారణ సాధ్యం
▪ ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం
▪ నెక్లెస్ రోడ్‌లో భారీ ‘మాక్ డ్రిల్’ ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు.. ప్రపంచస్థాయి సాంకేతికతతో తెలంగాణలో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

◆ **మొదటి గంట ఎంతో కీలకం..**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని ’గోల్డెన్ అవర్’గా పరిగణించాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిందనే సమాచారం రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా రెస్క్యూ బృందాలు సకాలంలో ఘటనా స్థలానికి చేరుకోవాలి. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వివిధ శాఖల మధ్య ముందస్తు సన్నద్ధత, వేగవంతమైన సమన్వయం ఎంతో అవసరం. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



◆ **అప్రమత్తత అవసరం...**

విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందని మంత్రి గుర్తుచేశారు. 1908 నాటి హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి, కృష్ణా నదుల వరదలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, అందుకే శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

◆ **ఆకట్టుకున్న రెస్క్యూ ఆపరేషన్ల ప్రత్యక్ష ప్రదర్శన:**

నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (NDMA) సహకారంతో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌లో ప్రత్యేక బృందాలు ప్రదర్శించిన రెస్క్యూ ఆపరేషన్లు ఆకట్టుకున్నాయి. గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలను ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. ఇటువంటి విస్తృత స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడంపై ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖలను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, పరిశ్రమలు, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మరింత పటిష్టంగా భారత్ - నార్వే బంధం!

▪ ఇరు దేశాల మధ్య ‘గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్’ ఏర్పాటు
▪ స్వచ్ఛ ఇంధనం, సాంకేతికత, అంతరిక్ష రంగాల్లో కీలక ఒప్పందాలు
▪ నార్వే పెట్టుబడులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత్ – నార్వే దేశాల మధ్య దౌత్య, ఆర్థిక బంధాన్ని సరికొత్త మైలురాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత పటిష్టం చేస్తూ ‘గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్’ (హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం) ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. నార్వే పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం (బ్లూ ఎకానమీ), నూతన ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతికతలలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయని వెల్లడించారు. ఇదే సమయంలో, పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు అండగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అంతర్జాతీయంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ – యూరప్ భాగస్వామ్యం ప్రపంచ శాంతికి ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ – నార్వే మధ్య కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా అంతరిక్ష పరిశోధన రంగంలో కీలక అడుగు పడింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ISRO), నార్వే స్పేస్ ఏజెన్సీల మధ్య కీలక ఒప్పందం కుదిరినట్లు ప్రధాని తెలిపారు. అంతరిక్ష పరిశోధనలు, భవిష్యత్తు ప్రాజెక్టుల కోసం నార్వే సాంకేతిక సహాయం తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న వివిధ రంగాలలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా నార్వే సంస్థలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాలలో నార్వే పెట్టుబడులకు భారత్‌లో అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్కిటిక్ పరిశోధనలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), సెమీకండక్టర్ల తయారీ, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి అత్యాధునిక రంగాలలో ఇరు దేశాలు కలిసి పనిచేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ దేశాలు ఒకే తాటిపై నడుస్తున్నాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భారత్ – యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన చారిత్రక ఒప్పందాల వల్ల అటు భారతదేశానికి, ఇటు నార్వేకు పారిశ్రామికంగా, ఆర్థికంగా అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎస్డీఆర్ఎఫ్ ‘మాక్ డ్రిల్’

▪ వరంగల్, హనుమకొండ లోతట్టు ప్రాంతాల్లో అవగాహన
▪ ముంపు ప్రాంతాలలో ముందస్తు అప్రమత్తత
▪ ఆకట్టుకున్న డ్రోన్, రోప్ రెస్క్యూ ప్రదర్శనలు

**వరంగల్/హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సహకారంతో వరంగల్, హనుమకొండ జంట జిల్లాల్లో విపత్తు నిర్వహణపై సమగ్ర ‘మాక్ డ్రిల్స్’ నిర్వహించారు. ఆకస్మిక వరదలు, భారీ వర్షాల వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా 4వ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో ఈ ముందస్తు అప్రమత్తత కార్యక్రమాన్ని చేపట్టారు.

**లోతట్టు ప్రాంతాల్లో అవగాహన:**

వరంగల్‌లోని గుండు చెరువు, శంభునిగుడి కాలనీ, ఖిలావరంగల్.. అలాగే హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ, వివేకానంద నగర్, గోపాలపూర్ వంటి లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలకు వరద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పోలీసులు సైరన్ ట్రయల్స్ కూడా నిర్వహించారు.



**రెస్క్యూ ఆపరేషన్ల ప్రదర్శన:**

వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల ద్వారా ఆహారం, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించడం.. భవనాలపై చిక్కుకున్న బాధితులను ‘రోప్ రెస్క్యూ’ పద్ధతి ద్వారా సురక్షితంగా కిందికి దించి వైద్య సేవలు అందించడం వంటి రెస్క్యూ ఆపరేషన్లను ఎస్డీఆర్ఎఫ్ బృందాలు విజయవంతంగా ప్రదర్శించాయి. వరదల్లో చిక్కుకున్న మూగజీవాలను సైతం ఎలా రక్షించాలో చేసి చూపించారు. ఈ మాక్ డ్రిల్‌కు వరంగల్‌లో అసిస్టెంట్ కమాండెంట్ జె. రాజేందర్ పర్యవేక్షకుడిగా, ఆర్ఎస్ఐ అమృతం రవి నాయకత్వం వహించగా.. హనుమకొండలో ఆర్ఐ రవి పర్యవేక్షించి, నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఎస్డీఆర్ఎఫ్ బృందాలను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో పాటు 4వ బెటాలియన్ కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, మే 18, 2026

# ఆశ్రమ పాఠశాలల్లో 'అక్రమ డిప్యుటేషన్ల' పర్వం!

- అడిషనల్ డైరెక్టర్‌కు 'రైట్ టు ఇన్ఫర్మేషన్ సేవా సొసైటీ' రాతపూర్వక ఫిర్యాదు
- బాలికల స్కూళ్లలో పురుష సిబ్బంది..
- విద్యార్థినుల భద్రతకు ముప్పు
- తక్షణమే విచారణ జరిపి రద్దు చేస్తాం
- ఏడీ వి.సర్వేశ్వర్ రెడ్డి హామీ



**హైదరాబాద్/నాగర్ కర్నూల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్ కర్నూల్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా, అశాస్త్రీయంగా జరుగుతున్న ఉపాధ్యాయ డిప్యుటేషన్లపై 'రైట్ టు ఇన్ఫర్మేషన్ సేవా సొసైటీ' సమర శంఖం పూరించింది. సొసైటీ జాతీయ అధ్యక్షుడు కె.బాబురామ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సోమవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ వి.సర్వేశ్వర్ రెడ్డిని కలిసి రాతపూర్వక ఫిర్యాదు సమర్పించింది. ఈ సందర్భంగా ఆర్టీఐఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు కె. బాబురామ్ నాయక్ మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (DTDO) నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, కొందరు ఉపాధ్యాయుల వ్యక్తిగత అనుకూలతల కోసం అక్రమంగా డిప్యుటేషన్లు ఇస్తూ గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. కొన్ని పాఠశాలల్లో ఒకే సబ్జెక్టుకు చెందిన ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులను ఒకే చోట వార్డెన్లుగా లేదా అదనపు సిబ్బందిగా కేటాయించడం వల్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ధ్వజమెత్తారు. మరోవైపు, మరికొన్ని స్కూళ్లలో అసలు సబ్జెక్ట్ ఫ్యాకల్టీ లేకుండా పోయి పాఠశాలలు మూతపడే పరిస్థితికి వచ్చాయని, దీనివల్ల ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థుల ఫలితాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ▪ బాలికల పాఠశాలల్లో పురుష సిబ్బందిపై ఆగ్రహం..

కల్వకుర్తి, జంగంరెడ్డిపల్లి, మన్ననూర్, ఉడిమిల్ల, చెంచుగూడం, లింగాల, నార్లాపూర్ వంటి గిరిజన బాలికల పాఠశాలల్లో కేవలం మహిళా సిబ్బంది మాత్రమే ఉండాలన్న ప్రాథమిక నిబంధనను పక్కన పెట్టి, పురుష సిబ్బందిని కొనసాగించడం విద్యార్థినుల భద్రతకు ముప్పుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి స్థానంలో వెంటనే మహిళా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

### ▪ అడిషనల్ డైరెక్టర్ సానుకూల హామీ..

ఈ లోతైన ఫిర్యాదుపై గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ వి.సర్వేశ్వర్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారు. గిరిజన విద్యార్థుల విద్యతో, బాలికల భద్రతతో ఆడుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ అక్రమ డిప్యుటేషన్లపై తక్షణమే లోతైన విచారణ జరిపించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పోస్టింగులను రద్దు చేస్తామని, ఉపాధ్యాయులందరినీ వారి అసలు స్థానాలకు పంపుతామని అధికారికంగా హామీ ఇచ్చారు. అధికారి స్పందనపై హర్షం వ్యక్తం చేసిన బాబురామ్ నాయక్, ఒకవేళ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే కమిషనరేట్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వేములవాడ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడికి సన్మానం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన తూము మధును మున్సిపల్ చైర్మన్ పుల్కమ్ రాజు స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని చైర్మన్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తూము మధు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, సీనియర్ నాయకులు సంగ స్వామి, కౌన్సిలర్లు కొండ శేఖర్, తోటరాజు శ్రీనివాస్, కో–ఆప్షన్ మెంబర్ కట్కూరి శ్రీనివాస్, సిరిగిరి శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఉత్సాహంగా 5కే మారథాన్ వాక్




**దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా దామెర మండల ప్రజా పరిషత్ పరిధిలో సోమవారం 5కే మారథాన్ వాకింగ్ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో యువత, ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పరుగును చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ 5కే మారథాన్‌లో ఎంపీఓ రంగాచారి, మండల విద్యాశాఖాధికారి, స్థానిక పోలీసు శాఖ తరపున ఏఎస్ఐ, మండల పరిషత్ సూపరింటెండెంట్, దామెర గ్రామ సర్పంచ్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

# ఎం.ఏ.ఖదీర్‌కు 'అంతర్జాతీయ డాక్టరేట్'



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వన్దే భారత్ :** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, లేనిటి ఫౌండేషన్ అనాథ వృద్ధుల ఆశ్రమ వ్యవస్థాపకుడు ఎం. ఏ. ఖదీర్ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. సమాజంలో నిరుపేదలు, అనాథ వృద్ధులకు ఆయన అందిస్తున్న నిరంతర సేవలను గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని ప్రకటించింది. చెన్నై నగరంలోని భారతీయ విద్యా భవన్‌లో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని ఆయనకు అత్యంత ఘనంగా అందజేశారు. లేనిటి ఫౌండేషన్ చైర్‌పర్సన్ షాజహాన్ బేగంతో కలిసి ఎం. ఏ. ఖదీర్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ అంతర్జాతీయ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ వెంకటేషన్, రష్యా, అమెరికా దేశాల దౌత్య అధికారులు, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు గోని నర్సింహా గౌడ్ చేతుల మీదుగా ఖదీర్‌కు డాక్టరేట్ మెడల్, ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. ఎం.ఏ.ఖదీర్ గత 2005 మే 5న అచ్చంపేటలో 'లేనిటి ఫౌండేషన్' అనాథ వృద్ధుల ఆశ్రమాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకు (దాదాపు 21 సంవత్సరాలుగా) వందలాది మంది అనాథలకు, వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి అండగా నిలుస్తున్నారు. గత 2023 సంవత్సరంలో కూడా ఆయన చేసిన సేవలకు గాను జాతీయ అవార్డు లభించింది. ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ స్థాయి గౌరవ డాక్టరేట్ లభించడంపై అచ్చంపేట పట్టణ ప్రజలు, పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తూ ఎం.ఏ.ఖదీర్, షాజహాన్ బేగం దంపతులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# బండి సంజయ్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

- పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్
- వేములవాడ తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ శ్రేణుల భారీ ధర్నా
- బండి సాయి భగీరథ్‌ను కాపాడేందుకు కాంగ్రెస్, బీజేపీల కుమ్మక్కు
- మైనర్ బాలికకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయింపు




**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే తన మంత్రి, ఎంపీ పదవులకు రాజీనామా చేయాలని, మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ఆయన కుమారుడు సాయి భగీరథ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు వేములవాడలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల ప్రకారం సోమవారం పట్టణంలోని ప్రధాన కూడలి అయిన తెలంగాణ చౌక్‌లో ధర్నా నిర్వహించారు. వేములవాడ పట్టణ, అర్బన్, రూరల్, కోనరావుపేట మండలాల పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి, బండి సంజయ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కొడుకు అనే అహంకారంతో బండి సాయి భగీరథ్ ఒక మైనర్ బాలికపై దారుణానికి ఒడిగట్టి, చట్టం నుండి తప్పించుకునేందుకు ఎనిమిది రోజుల పాటు పరారీలో ఉండి చివరకు లొంగిపోయాడని మండిపడ్డారు. ఈ కేసులో నిందితుడికి సరైన శిక్ష పడకుండా ఉండేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కలిసి లోపాయికారీగా కుమ్మక్కయ్యాయని, సాయి భగీరథ్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ 'బేటీ బచావో–బేటీ పడావో' నినాదాలు ఇస్తుంటే, ఆయన మంత్రివర్గంలోని సభ్యుడి కుమారుడే బాలికల భద్రతకు ముప్పుగా మారడం సిగ్గుచేటన్నారు. ఈ కేసు నిష్పక్షపాతంగా సాగాలంటే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలైన మైనర్ బాలికకు తగిన న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని హెచ్చరించారు. వేములవాడ పట్టణ సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, అర్బన్ మండల సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్ రావు, రూరల్ మండల అధ్యక్షుడు గోసుకుల రవి, నాయకులు మ్యాకల రవి, కోనరావుపేట మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, వివిధ మండలాల సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పదవికి రాజగోపాల్ దరఖాస్తు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పదవికి అచ్చంపేట పట్టణానికి చెందిన చింతల రాజగోపాల్ సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణకు ఆయన తన దరఖాస్తు పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ.. వెనుకబడిన నల్లమల్ల ప్రాంత అభివృద్ధికి, అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి జిల్లా స్థాయి పోస్టులో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ కోసం స్వచ్ఛందంగా పనిచేసే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, మే 18, 2026

## డాక్యుమెంట్ రైటర్స్ నూతన అధ్యక్షుడిగా పంపరి నాగరాజు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ పట్టణ డాక్యుమెంట్ రైటర్స్ సంఘం నూతన అధ్యక్షుడిగా పంపరి నాగరాజును సంఘ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. రైటర్స్ వృత్తికి గౌరవం పెరగడంతో పాటు, కార్యాలయాల్లో ఎదురయ్యే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. సంఘ సభ్యుల ఐక్యతతో డాక్యుమెంట్ రైటర్స్ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు నాగరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా పంపరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా సోమినేని మహేష్, నేరెళ్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా పలమారి అనిల్ యాదవ్, సంయుక్త కార్యదర్శి కొమ్మనపల్లి రాజశేఖర్, క్యాషియర్ తోట క్రాంతి, క్రీడల కార్యదర్శి గాజుల నరేష్, కార్యవర్గ సభ్యులుగా జోగం శరత్, అద్దంకి రాకేష్ ఎన్నికయ్యారు.

## జానపద కళాకారులకు ఘన సత్కారం

**దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తక్కళ్లపహాడ్ గ్రామ సర్పంచ్ దాడి వసంత రమేష్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన జానపద కళాకారులు రాజబోయిన సంధ్యారాణి, దాడి అరుణ, దాడి రజిత, దాడి లక్ష్మి, కేతనబోయిన శైలజ, బొడ్డు పద్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను అభినందించారు.

# 'భారీ మాక్ డ్రిల్' విజయవంతం

- నల్లమల్ల అడవుల్లో విపత్తు నిర్వహణపై మాక్ డ్రిల్
- అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల సన్నద్ధతకు పరీక్ష
- నేతృత్వం వహించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్
- వాస్తవికతను తలపించిన సహాయక చర్యలు..
- డ్రోన్లు, ఎస్డీఆర్ఎఫ్ బృందాల వినియోగం



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్ కర్నూలు జిల్లా నల్లమల్ల అటవీ ప్రాంతంలో వరదలు, విపత్తులు, మరియు వేసవి అటవీ అగ్ని ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన తక్షణ రక్షణ చర్యలపై జిల్లా యంత్రాంగం సన్నద్ధతను పరీక్షించేందుకు భారీ స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్ (మాక్ డ్రిల్) విజయవంతంగా నిర్వహించారు. నల్లమల్ల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని రాసమల్లబావి, వట్టువర్లపల్లి, బ్రహ్మగిరి ప్రాంతాల్లో సోమవారం ఈ కసరత్తు జరిగింది. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ నాయకత్వంలో జరిగిన ఈ వినూత్న



కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరించారు.

### యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు..

నిజంగా అగ్ని ప్రమాదం సంభవించిన వాతావరణాన్ని క్షేత్రస్థాయిలో సృష్టించి, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, రెస్పాన్స్ టైమ్, మరియు రక్షణ సామర్థ్యాలను అధికారులు సమగ్రంగా పరీక్షించారు. ఈ డ్రిల్‌లో డ్రోన్లు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటాలు, అత్యాధునిక సాంకేతిక పరికరాలను వినియోగించారు. రాసమల్లబావి వద్ద 'స్టేజింగ్ ఏరియా' ఏర్పాటు చేసి సిబ్బంది, వాహనాల రిజిస్ట్రేషన్ నిర్వహించగా, అటవీ అంచున 'ఇన్సిడెంట్ కమాండ్ పోస్ట్ ' నిర్మించి జీఐఎస్ ఆధారిత మ్యాపింగ్ ద్వారా పరిస్థితిని లైవ్‌గా పర్యవేక్షించారు. అటవీ సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక ఎల్‌సిఈఎస్ విధానాన్ని కఠినంగా అమలు చేశారు.

### పునరావాస కేంద్రాల ప్రదర్శన..

వట్టువర్లపల్లి ప్రభుత్వ హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద తాత్కాలిక రిలీఫ్ & రిహాబిలిటేషన్ సెంటర్‌తో పాటు మెడికల్ ఎయిడ్ పోస్ట్, ట్రయాజ్ సెంటర్లను ఏర్పాటు చేసి, ప్రమాద స్థలం నుంచి బాధితులను ఎలా తరలించాలో ప్రయోగాత్మకంగా చూపించారు. అలాగే నేషనల్ హైవే (ఎన్ హెచ్ -765) పై ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్ని శాఖల పనితీరును అభినందిస్తూ.. భవిష్యత్తులో విపత్తులపై మరింత వేగంగా స్పందించేలా సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. శ్రీశైలం వెళ్లే యాత్రికులు, అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే పనులు చేయవద్దని, పొగ కనిపిస్తే వెంటనే అధికారులకు తెలపాలని కోరారు. అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్, డీపీఓ శ్రీరాములు, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, అధికారులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి

**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, సామాన్య ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చింతల నాగరాజు డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని రాయిచేడు గ్రామంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చింతల నాగరాజు మాట్లాడుతూ.. 'ధరల భారం–బ్రతుకు ఘోరం' అనే చందంగా నేడు సామాన్యుడి పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పెరిగిపోతున్న ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువులను కూడా కొనలేని దుస్థితిలో ఉన్నారని మండిపడ్డారు. దేశంలోని బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం.. సామాన్య, పేద ప్రజలపై మాత్రం జీవన భారాలు వేయడం



దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, ధరల పెంపును సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్రం దిగివచ్చి చమురు, గ్యాస్ ధరలను నియంత్రించకపోతే ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గొడుగు వెంకటయ్య, గొడుగు చంద్రయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు బాలయ్య, రైతు సంఘం నాయకుడు తోళ్ల ఆనంద్, డివైఎఫ్ఐ నాయకులు యాదయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చేపల మృతిపై విచారణ చేపట్టాలి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** లింగోటం చెరువు సమీపంలోని చవటకుంటలో భారీగా చేపలు చనిపోవడంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని మత్స్యకారులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. పట్టణ మురుగునీరు చేరడం వల్లే చేపలు చనిపోయాయని కొందరు అంటుండగా, పక్కనే ఉన్న మల్లంకుంటలో కాకుండా ఇక్కడే చనిపోవడం వెనుక విష ప్రయోగం జరిగి ఉండవచ్చని మరికొందరు అనుమానిస్తున్నారు. ఈ విషయమై లింగోటం, వలపట్ల కాలనీ యువకుల మధ్య గొడవలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి అసలు కారణాలు తేల్చాలని కోరుతున్నారు. చవటకుంట కంటే ముందే ఉన్నా మల్లం కుంటలో కూడా మురుగునీరు కలిసివుందని అక్కడ చావని చేపలు చవటకుంట కుంటలో ఏలా చనిపోతాయని సంబంధిత అధికారులు పూర్తి స్తాయిలో విచారణ చేసి చేపలు చనిపోవడానికి అసలైన కారణం ఎమిటో తేల్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై లింగోటం,వలపట్ల కాలనీల మధ్య యువకుల మధ్య గోడవలు చోటుచేసున్నాయని అన్నింటిని పరిగణలోకి తీసుకోని విచారణ చేయాలని కోరుతున్నారు.

## రైతు పక్షపాతి మన ప్రజాప్రభుత్వం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత ప్రజాప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు & అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేశారు. నాడు 'వరి వేస్తే ఉరి' అన్న పాలకులకు భిన్నంగా, నేడు తమ ప్రభుత్వం సన్న వడ్ల సాగును ప్రోత్సహిస్తూ మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లిస్తోందని ప్రకటించారు. రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఎలాంటి ఆలస్యం లేకుండా వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నగదు జమ చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇచ్చిన ప్రతి మాటను ప్రభుత్వం నెరవేరుస్తోందని స్పష్టం చేశారు. గత పాలకులు ఐదేళ్లలో చేయలేని రుణమాఫీని, తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రూ. 21 వేల కోట్లు విడుదల చేసి, 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. గతంలో రైతు బంధు కింద రూ. 10 వేలు అందిస్తే, ప్రస్తుతం రైతు భరోసా ద్వారా రూ. 12 వేలు అందిస్తున్నామన్నారు. రైతులు పంటను భద్రపరుచుకునేందుకు వీలుగా రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని 200 శాతం మేర పెంచేలా కార్యాచరణ రూపొందించినట్లు, ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కోల్డ్ స్టోరేజీలను నిర్మిస్తామని వెల్లడించారు. అప్పుల భారం ఉన్నప్పటికీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి అనేక సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

# ఎనబెట్ల శివారులో పిడుగుపడి 30 గొర్రెల మృతి

- కాపరికి తప్పిన ప్రాణాపాయం
- పిడుగుపాటు బాధితునికి మంత్రి జూపల్లి తక్షణ సాయం
- రూ.50 వేలు అందజేత



**కొల్లాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎనబెట్ల గ్రామ శివారులో శనివారం చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో పిడుగుపాటుకు గురై 30 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తక్షణమే స్పందించి బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని బాధితుడిని ఓదార్చారు. ప్రభుత్వం తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తన సొంత నిధుల నుండి తక్షణ సహాయం కింద రూ.50 వేల నగదును అందజేశారు. బాధితునికి చట్టపరమైన ప్రభుత్వ పరిహారం కూడా త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి కొల్లాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును అకస్మాత్తుగా సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్న రాశులను ఆయన నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని సైతం గోదాములకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి భారీగా పెరగడంతో గోదాముల కొరత ఏర్పడిందని, దీనిని అధిగమించడానికి కాటన్, ప్రైవేట్ గోదాములతో పాటు అవసరమైన చోట ఫంక్షన్ హాళ్లను సైతం ప్రభుత్వం వినియోగిస్తోందని మంత్రి వివరించారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి చేతులు దాల్చేసి క్షేత్రస్థాయిలో కొనుగోలు చేయడం లేదని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు చాలా తక్కువ ధర ఉన్నప్పటికీ, రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. హమాలీల కొరత, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. రైతులు పండించిన చివరి ధాన్యం గింజను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నాగుల రామలక్ష్మి భౌతికకాయానికి విప్ ఆది శ్రీనివాస్ నివాళులు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాతృమూర్తి నాగుల రామలక్ష్మి మరణించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వేములవాడలో జరిగిన అంతిమ యాత్రలో ఆయన పాల్గొని సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మనోహర్ రెడ్డి ఓదార్పు



**వేములవాడ రూరల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో మరణించిన జంకె మల్లేశం, సందేల నర్సయ్య, అలాగే శాత్రాజుపల్లె గ్రామంలో మృతి చెందిన బూర్ల రాజేశ్వరి కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. సోమవారం ఆయా గ్రామాల్లోని బాధిత కుటుంబాలను కలిసి వారి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంకె మధు, మాజీ సర్పంచులు విజయ శ్రీనివాస్ రెడ్డి, పండుగ తిరుపతి, లచ్చయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, నాయకులు పసుల అంజిబాబు, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, మాధవీలతలకు ప్రశంసా పత్రాలు

**సిరిసిల్ల,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 90 శాతానికి పైగా విద్యార్థుల హాజరు నమోదు సాధించిన వేములవాడ మండలానికి చెందిన ఇద్దరు ప్రధానోపాధ్యాయులకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాలు బహూకరించారు. వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ, రుద్రవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవీలతలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కలిసి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ బడుల్లో హాజరు శాతాన్ని పెంచేందుకు వారు చేసిన కృషిని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు.



# రక్తపోటును నియంత్రించండి.. ఆరోగ్యంగా జీవించండి


- డీఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్
- అచ్చంపేటలో అవగాహన ర్యాలీ




**అచ్చంపేట,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రతి ఒక్కరూ తమ రక్తపోటు స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని, ఒకవేళ అధిక రక్తపోటు ఉంటే వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలి ద్వారా దానిని నియంత్రణలో ఉంచుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రవికుమార్ పిలుపునిచ్చారు. 'ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం' సందర్భంగా ఆదివారం అచ్చంపేట ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ జిల్లాలో 30 సంవత్సరాల పైబడిన 4,84,885 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, వారిలో 82,188 మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లు గుర్తించామని షాకింగ్ గణాంకాలను వెల్లడించారు. అధిక రక్తపోటుకు ముందస్తుగా ఎలాంటి లక్షణాలు ఉండవని, సైలెంట్ కిల్లర్‌గా మారే ప్రమాదం ఉన్నందున కేవలం పరీక్షల ద్వారానే దీనిని గుర్తించగలమన్నారు. మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, బరువు పెరగడం, ఆహారంలో ఉప్పు, నూనె ఎక్కువగా వాడటం, జంక్ ఫుడ్ సంస్కృతి వల్లే ఈ మహమ్మారి విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీపీని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీ వైఫల్యం, గుండెపోటు, బ్రెయిన్ హెమరేజ్, పక్షవాతం, కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలలో అధిక రక్తపోటును సమర్థవంతంగా నియంత్రించే కాంబినేషన్ డ్రగ్స్ ఉచితంగా అందుబాటులో ఉన్నాయని డిఎంహెచ్ఓ తెలిపారు. బాధితులు ప్రతినెలా స్థానిక ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ బిక్కు, డీపీఎంఓ మధుమోహన్, అచ్చంపేట డివిజన్ ఉప మలేరియా అధికారి బికులాల్, పీహెచ్‌ఎన్ రజిత, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, నర్సింగ్ అధికారులు, మగ ఆరోగ్య కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# వేములవాడ పట్టణ అధ్యక్షుడిగా తూమ్ మధు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నూతన అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడ పట్టణ అధ్యక్షుడిగా తూము మధు, అర్బన్ మండల అధ్యక్షుడిగా వంగ పరశురాములు గౌడ్, రూరల్ అధ్యక్షుడిగా సోయినేని కరుణాకర్, కోనరావుపేట మండల అధ్యక్షుడిగా మానుక సత్యం, చందుర్తి మండల అధ్యక్షుడిగా గొట్టే ప్రభాకర్, రుద్రంగి మండల అధ్యక్షుడిగా ఎర్రం గంగా నరసయ్యలు నియమితులయ్యారు. నూతన అధ్యక్షులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.